నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్




## ఓటును సద్వినియోగించుకోవాలి




ఓటు హక్కు వినియోగించుకున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మే 8 : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ (స్థానిక సంస్థలు) పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కును ఆయన వినియోగించుకున్నారు.

## 10 వరకు పోస్టల్ బ్యాలెట్ గడువు

నస్పూర్, మే 8 : లోక్‌సభ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈ నెల 10వ తేదీ వరకు గడవు పొడిగించినట్లు మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మందమర్రిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



మంచిర్యాల జిల్లాలోని నూతన కలెక్టరేట్ కార్యాలయం

# కొత్త జిల్లాలను కుదిస్తే కష్టాలే..

## నూతన జిల్లాల ఏర్పాటుతో చేరువైన పాలన

- దశాబ్దాల కలను సాకారం చేసిన కేసీఆర్ సర్కారు
- జిల్లాలను రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- మండిపడుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజానీకం

మంచిర్యాల, మే 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కొత్త జిల్లాలను రద్దు చేస్తామంటూ వస్తున్న ప్రకటనలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులు వ్యతిరేకిస్తున్నారు. ఉన్న జిల్లాలను రద్దు చేసి.. మళ్లీ పాత కష్టాలు తెస్తారా? అంటూ మండిపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేయాలనేది దశాబ్దాల కల. పాత జిల్లా ఉన్నప్పుడు మంచిర్యాల, ఆసిఫాబాద్‌లను తూర్పు జిల్లా అని పిలుచుకునే వారు. ఆదిలాబాద్– నిర్మల్‌లను పశ్చిమ జిల్లాగా చెప్పేవారు. అప్పుడెప్పుడో ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మంచిర్యాలను ప్రత్యేక జిల్లా చేస్తామంటూ ప్రకటించారు. కానీ.. దశాబ్దాలపాటు అది కేవలం నినాదంగానే మిగిలింది. ప్రభుత్వాలు మారినా జిల్లాల పునర్విభజన జరగలేదు. ఉద్యమ సమయంలో ఆదిలాబాద్ పర్యటన సందర్భంగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తామంటూ ప్రకటించిన కేసీఆర్.. స్వరాష్ట్రం సాధించుకున్నాక జిల్లాల పునర్విభజనపై అద్భుతమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. మందుచూపుతో మంచిర్యాలతోపాటు ఆసిఫాబాద్, నిర్మల్‌లను కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేసి.. జిల్లావాసుల దశాబ్దాల కలను సాకారం చేశారు.

### ఎన్నో సంస్కరణలకు బీజం

తెలంగాణలో 2016లో కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం ద్వారా పరిపాలన చేరువైంది. జిల్లాలతోపాటు కొత్త మండలాలు, కొత్త మున్సిపాలిటీలు వచ్చాయి. అన్నింటికంటే మించి మారుమూల గోండు గూడేలు, తండాలు గ్రామ పంచాయతీలుగా మారాయి. రూ.55 కోట్ల నుంచి రూ.60 కోట్లతో కొత్త కలెక్టరేట్ కార్యాలయాలు నిర్మితమయ్యాయి. ఎస్పీ కార్యాలయాలు, కమిషనరేట్లు, మెడికల్, నర్సింగ్ కాలేజీలు, రెవెన్యూ డివిజన్‌లు ఇలా ఎన్నో ఎనిమిదేళ్లలో జరిగాయి. కొత్త జిల్లాలు అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచాయి. అన్నింటికీ మించి ప్రభుత్వ సేవలు చేరువయ్యాయి. ప్రైవేటు పరిశ్రమలు, కంపెనీలు, బ్యాంకులు, రోడ్లు, రైలు మార్గాలు ఇలా అనేక హంగులు కొత్త జిల్లాలకు సమకూరాయి. జిల్లా కార్యాలయాలు అత్యంత సమపంలోకి వచ్చాయి. పరిధి చిన్నగా ఉండడంతో పాలనపై కలెక్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణ పెరిగింది. ప్రజాసమస్యల పరిష్కారంలో వేగం పెరిగింది. ఎస్పీ కార్యాలయాలు, కమిషనరేట్లు రావడంతో శాంతి భద్రతలు పెరిగాయి. నేరాలు నియంత్రణలోకి వచ్చాయి. జిల్లాలకు ప్రైవేటు పెట్టుబడిదారులు రావడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. చిన్న జిల్లాలు రాష్ట్రానికి ఆర్థిక వనరులుగా మారాయి.

### ఇప్పుడు కుదిస్తే కష్టాలే..

కొత్త జిల్లాలను రద్దు చేసి పాత జిల్లాలను కొనసాగించినా.. పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా జిల్లాలను ఏర్పాటు చేసినా ఇబ్బందులు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉన్నఫలంగా జిల్లాలను కుదిస్తే వచ్చే లాభాల కంటే, నష్టాలే ఎక్కువని చెప్తున్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులకు ఇబ్బందులు వస్తాయి. కొత్త జిల్లాలతో చాలా మందికి ప్రమోషన్లు వేగంగా వచ్చాయి. ఇప్పుడు రద్దు చేస్తే వారి పరిస్థితి ఎలా ఉంటుందనేది చెప్పలేం. ఇక నిరుద్యోగులు ఉద్యోగాల కోసం మరో రెండు, మూడేళ్లు ఎదురుచూడాల్సి వస్తది. జిల్లాలను మారిస్తే జోన్ల విభజన కచ్చితంగా చేయాలి. నూతన జోనల్ వ్యవస్థను రూపొందించాలి. దానికి అసెంబ్లీ ఆమోదం తీసుకుని, రాష్ట్రపతి ఉత్తర్వుల కోసం పంపాలి. ఈ ప్రక్రియంతా పూర్తయ్యేసరికి యేండ్లు గడిచిపోతాయి. అప్పటి వరకు కొత్త నోటిఫికేషన్లు ఇవ్వడానికి వీలుండదు. ఫలితంగా నిరుద్యోగులు నష్టపోతారు.

### పాత రోజులు తప్పవ్..

ఉమ్మడి జిల్లాలో కొత్త జిల్లాలను రద్దు చేస్తే మళ్లీ పాత రోజులు వస్తాయి. మంచిర్యాల, ఆసిఫాబాద్ నుంచి కలెక్టరేట్‌కు పోవాలంటే 100, 150 కిలోమీటర్లు పోవాలి. మారుమూల ప్రాంతాలైన బెజ్జూర్, సిర్పూర్, చింతలమానేపల్లి, కౌటాల, వేమనపల్లి, కోటపల్లి, నెన్నెల నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లాలంటే ఒక్క రోజు పడుతుంది. ఇంట్లో సద్ది కట్టుకుని ఆదిలాబాద్ పోయేందుకు ఒక రోజు, అక్కడ పని చూసుకునేందుకు ఒక్క రోజు, అది పూర్తయ్యాక తిరిగి రావడానికి మరో రోజు మొత్తం మూడు రోజులు కేటాయించాలి. వ్యయప్రయాసలు పెరుగుతాయంటూ పాత రోజులను తలచుకుని జిల్లావాసులు భయపడిపోతున్నారు. కోరి కొరవితో తలగొక్కునట్లు ఏదో మార్పు కోసమని నమ్మి కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇన్ని కష్టాలు పడాల్సి వస్తుందనుకోలేని వాపోతున్నారు. జిల్లాల జోలికొస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఉన్న జిల్లాలను రద్దు చేయాలని ఎవ్వరం కోరుకోవడం లేదని చెప్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ తన ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని, లేకపోతే కొత్త జిల్లాల రద్దుకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు.

### జిల్లాలు రద్దు చేస్తే నష్టాలివే..

- జిల్లా స్థాయి అధికారులు, ఆఫీస్‌లు మళ్లీ ప్రజలకు దూరమవుతాయి. కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలు, పోలీస్ కమిషనరేట్లు అలంకారప్రాయంగా మారుతాయి.
- జిల్లా దవాఖానల స్థాయి పడిపోతుంది. నిధులు, సదుపాయాలు తగ్గుతాయి. జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పడిన మెడికల్, నర్సింగ్ కాలేజీలకు ఇబ్బందులు ఎదురవుతాయి.
- జోనల్ వ్యవస్థను మళ్లీ మార్చాల్సి వస్తుంది. ఉద్యోగ నోటిఫికేషన్లు ఆలస్యమవుతాయి.
- కొత్త జిల్లాలతో ప్రమోషన్లు పొందిన ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురవుతాయి. క్యాడర్ స్ట్రెంత్ తగ్గిపోయి ప్రమోషన్లపై ప్రభావం పడుతుంది.
- కొత్త సంస్థలు, ప్రముఖ కంపెనీలు, పరిశ్రమల ఏర్పాటు తగ్గిపోయి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గుతాయి. ఇప్పటి వరకు వచ్చిన సంస్థలు వెనక్కి పోయే ప్రమాదం ఉంది.
- ఉమ్మడి జిల్లాలో ఇప్పుడున్న నలుగురు కలెక్టర్లు, ఎనిమిది మంది అడిషనల్ కలెక్టర్లు పోయి ఒక కలెక్టర్, ఇద్దరు అడిషనల్ కలెక్టర్లు మాత్రమే ఉంటారు. దీంతో జిల్లా పర్యవేక్షణ కష్టమవుతుంది. సామాన్యుల సమస్యల పరిష్కారానికి అధిక సమయం పడుతుంది.
- జిల్లాలవారీగా కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, నవోదయ వంటి విద్యా సంస్థలకు నిధులు తగ్గిపోతాయి.

## కాంగ్రెస్‌ది మూర్ఖపు ఆలోచన



కొత్త జిల్లాల ఏర్పాటు కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటి నుంచి మంచిర్యాల ప్రజలు ఎదురు చూశారు. దశాబ్దాల కలను కేసీఆర్ సీఎం అయ్యాక నెరవేర్చారు. ఏర్పడిన జిల్లా ఇప్పుడు దశాబ్దకాలం కూడా ఉండేలా లేదు. రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ చిన్న జిల్లాలు ప్రగతికి సోపాలను అని చెప్పారు. అలాంటి రేవంత్‌రెడ్డి జిల్లాలు ఎందుకు రద్దు చేస్తున్నారో ఆయనకే స్పష్టత లేదు. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన రోజు కచ్చితంగా ఒకటి వస్తది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉన్నప్పుడు కలెక్టరేట్‌కు పోయి కష్టాలు చెప్పుకోవడం కంటే నష్టపోవడమే మేలు అనుకునేవాళ్లు చాలా మంది. జిల్లా కేంద్రానికి వెళ్లి రావాలంటే మూడు, నాలుగు రోజుల సమ యం పట్టేడి. అలాంటి పరిస్థితి నుంచి గంటలో కలెక్టర్‌ను కలుసుకునే రోజులు వచ్చాయి. కేసీఆర్ సర్కార్ చేసిన పనుల ఆనవాళ్లు లేకుండా చేయాలనేది కాంగ్రెస్ మూర్ఖపు ఆలోచన. దీంతో పట్టణాలు, నగరాలు మళ్లీ వెనకబడి పోతాయి. జిల్లాల రద్దు ఆలోచనను వెనక్కి తీసుకోవాలి. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం. ప్రజలకు నష్టం చేసే ఏ పనినైనా నిలదీస్తాం. మా అధినేత ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు జిల్లాల రద్దుకు వ్యతిరేకంగా యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

*– గోగుల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి*

# దగాకోరు కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

- పార్లమెంట్ ఎన్నికల తర్వాత సింగరేణి ప్రైవేటీకరణకు కుట్ర
- అదానీకి గనులు కట్టబెట్టేందుకు దావోస్‌లో ఒప్పందం
- సీఎం రేవంత్‌కు, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌కు, పొంగులేటికి కమీషన్‌లు
- బీఆర్ఎస్ పథకాలను కూడా అమలు చేయడం లేదు.
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్

మందమర్రి, మే 8: దగాకోరు కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. బుధవారం రాత్రి మందమర్రి పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని, ఈ మేరకు దావోస్‌లో అదానీతో సీఎం రేవంత్ రెడ్డి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణకు సీఎంతో పాటు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కమీషన్‌లు అందనున్నాయన్నారు. గతంలోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణి గనులను అదానీకి కట్టబెట్టేందుకు కుట్రలు చేయగా, అప్పటి సీఎం కేసీఆర్ అడ్డుకున్నారని, తాను కూడా మార్కెట్ సెంటర్‌లో రణదీక్ష చేశానని గుర్తు చేశారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణకు రాహుల్, మోడీలు అనుకూలంగా ఉంటారే తప్ప.. వ్యతిరేకించరని చెప్పుకొచ్చారు. ఇప్పటి వరకు రైతు బంధు పడలేదని, 20 రోజులు గడచినా కల్లాల్లో వడ్లు కొనడం లేదని, వర్షానికి వడ్లు తడిసి రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కొనుగోలు కేంద్రాలను సందర్శించగా రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారని, కేసీఆర్ పాలనలో 15 రోజుల్లోనే వడ్లన్నీ కొన్నారని వారు చెప్పినట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లాలో రైస్ మిల్లులు సరిపోక జమ్మికుంట, పెద్దపల్లి, కామారెడ్డిల లోని రైస్ మిల్లులకు వడ్లు తరలించామని గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండి వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేశామని, అయినా ఏం పాపం చేశామని తమను దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అందాయా అని, ఈ దగాకోరు సర్కారుకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కనీసం సీఎంఆర్ఎఫ్, ఎల్‌వోసీలు ఇవ్వడం లేదని ఆయన అన్నారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన 45 వేల చెక్కులను బాధితులకు అందించకుండా దగ్గర పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు. మందమర్రి మున్సిపాలిటీలో తాము 560 డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించామని, ఎమ్మెల్యే వివేక్ కనీసం వాటిని కూడా పంపిణీ చేయలేడం లేదని మండిపడ్డారు. వివేక్ రూ. 300 కోట్లు ఖర్చు చేసి తన కొడుకువంశీకి ఎంపీ టికెట్ తెచ్చుకున్నాడని, ఈ ఎన్నికలు ఆగర్భ శ్రీమంతునికి.. భూగర్భ గని కార్మికునికి మధ్య జరుగుతున్నాయని ఆయన తెలిపారు. కార్మికుల కష్టాలు తెలిసిన బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపు నిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సహకారంతో బొగ్గు గనుల ప్రైవేటీరణను అడ్డకుంటామని, అందుకు పార్లమెంట్‌లో పోరాడేందుకు మానవాడు ఎంపీగా ఉండాలని, దీనిని గమనించి ప్రజలు, కార్మికులు నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన బూటకపు హామీలన్నీ బుట్టదాఖలవుతున్నాయని అన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నారన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే సింగరేణి కార్మికుల ఆదాయపు పన్ను రద్దు, పెన్షన్ పెంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తానని, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి వారి కష్టాలు తీర్చేందకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు మందమర్రి పట్టణంలో వారికి ఘన స్వాగతం లభించింది. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి కొప్పుల ఈశ్వర్, బాల్క సుమన్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక నాయకులు ఒగ్గుడోలు చప్పుళ్లతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంల బీఆర్స్, టీబీజీకేఎస్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### పెద్దపల్లిలో గెలిచేది బీఆర్ఎస్సే



మాట్లాడుతున్న బాల్కసుమన్

రామకృష్ణాపూర్, మే 8 : పెద్దపల్లి పార్లమెంట్‌లో గెలిచేది బీఆర్ఎస్ పార్టీయేనని మాజీ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్‌లోగల సూపర్ బజార్ సెంటర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ డబ్బులిచ్చి లీడర్లను కొంటున్నాడని తెలిపారు. పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే అధినేత కేసీఆర్‌కు బలంపెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు నియోజకవర్గం ఇన్‌చార్జి రాజారమేశ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్‌గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొప్పులను గెలిపించాలి

**మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**



స్టేషన్ రోడ్డు కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, మే 8 : సింగరేణి కార్మికుల సమస్యలపై అవగాహన ఉన్న పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కోరారు. బుధవారం రాత్రి బెల్లంపల్లి పట్టణంలోని స్టేషన్ రోడ్డు కాలనీలో శాంతిఖని గని పిట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్‌తో కలిసి ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. అలాగే స్టేషన్ మెయిన్ రోడ్డుపై ప్రతి దుకాణానికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ ఎన్నికలు సింగరేణి కార్మికుడికి.. వందల కంపెనీల సీఈవోకు మధ్య జరుగుతున్నవని ప్రజలు ఆలోచించి ఓటేయాలన్నారు. రాజ్యాంగంలో రిజర్వేషన్లు ఒకే కుటుంబానికి వర్తిస్తాయా అని ప్రశ్నించారు. తమ్ముడు చెన్నూర్ ఎమ్మెల్యే.. అన్న బెల్లంపల్లి ఎమ్మెల్యే.. ఇప్పుడు వివేక్ కొడుకు వంశీ ఎంపీగా పోటీ పడుతున్నారని తెలిపారు. అన్ని పదవులు ఒకే కుటుంబానికికేనా అని, ఇక్కడ ఆ కుటుంబం తప్ప.. మరో దళితులకు అవకాశం ఇవ్వరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేసి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. శాంతిఖని పిట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్, ఏరియా నాయకుడు వెంకటరమణ మాట్లాడుతూ సింగరేణి కార్మికుల హక్కుల సాధన కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. సింగరేణి ఏరియా దవాఖాన పిట్ కార్యదర్శి అనుముల సత్యనారాయణ, ఆవుల రవికిరణ్ పాల్గొన్నారు.

# ఓటు హక్కును వినియోగించుకోండి

- రాజారం గ్రామస్తులను కోరిన అదనపు కలెక్టర్, ఏసీపీ
- రోడ్డు నిర్మాణం చేపట్టేదాకా ఎన్నికల్లో పాల్గొనేది లేదని ప్రజల స్పష్టం



కోటపల్లి : రాజారంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, ఏసీపీ, అధికారులు

కోటపల్లి, మే 8 : ఓటు ద్వారానే ప్రజాస్వామ్య పరిరక్షణ జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ మోతీలాల్, ఏసీపీ వెంకటేశ్వర్లు కోరారు. రోడ్డు లేక అష్టకష్టాలు పడుతున్నామని, రోడ్డు నిర్మాణం చేపట్టేదాకా ఓట్లు వేయమంటూ ఇటీవల రాజారం గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేసిన విషయం విదితమే. ఈ మేరకు బుధవారం రాజారం గ్రామస్తులతో అదనపు కలెక్టర్, ఏసీపీ సమావేశమయ్యారు. ఓటు ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని, ఓటర్లు ముందుకొచ్చి ఈ ఎన్నికల్లో పాల్గొనాలని వారు సూచించారు. ఇందుకు వారు స్పందిస్తూ రోడ్డు లేక దశాబ్దాలుగా అవస్థలు పడుతున్నామని, సమస్యకు పరిష్కారం దొరికే దాకా ఎన్నికల్లో పాల్గొనమని వారు స్పష్టం చేశారు. ఎన్నికల అనంతరం సమస్యకు పరిష్కారం చూపుతామని, ప్రస్తుతం ఓటరు స్లిప్‌లు తీసుకోవాలని అధికారులు సూచించినా వారు వినలేదు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ రాజేందర్, ఎంపీడీవో ఆకుల భూమయ్య, ఆర్ఐ రాజలింగు, ఏఈవో శేఖర్, పంచాయితీ కార్యదర్శి అజ్మెర రమాదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మోసాల కాంగ్రెస్‌ను ఓడించాలి



కన్నేపల్లిలో ప్రచారం చేస్తున్న దివాకర్‌రావు

- కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- దండేపల్లి మండలంలో ఇంటింటా ప్రచారం
- బీఆర్ఎస్‌లో చేరికలు

దండేపల్లి, మే 8 : ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌ను ఓడించాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు పిలుపునిచ్చారు. బుధవారం దండేపల్లి మండలం కన్నేపల్లి, గూడెం, నంబాల, వెల్గనూర్, కాసిపేట గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన తప్పు మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని, కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. కేసీఆర్ సర్కారులో చేపట్టిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ఓటేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అనిల్, వైస్ చైర్మన్ అక్కల రవి, బీఆర్ఎస్ నాయకులు కానగంటి మధు, మగ్గిడి శ్రీనివాస్, సత్తయ్య, వెంకటరమణ, ముచ్చర్ల తిరుపతి, హరీశ్, అజయ్, రాకేశ్, పాల్గొన్నారు.

### కాసిపేటలో చేరికలు

కాసిపేట గ్రామానికి చెందిన పలువురు బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కష్టపడి పని చేసి బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలన్నారు. కేసీఆర్ సర్కారు చేపట్టిన ప్రగతిని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అనిల్, నాయకులు వెంకటరమణ, వెంటకేశ్, రాజన్న, హరీశ్, అంజన్న పాల్గొన్నారు.

# అలుపెరగని గులాబీ సేన

- జిల్లాలో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం
- సభలు, సమావేశాలు, రోడ్ షోలతో బిజీ
- ప్రజలతో మమేకమవుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్న శ్రేణులు
- బీఆర్ఎస్ అభ్యర్థి సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపు



రెబ్బెన : జక్కులపల్లి లో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): జిల్లాలో గులాబీ సేన అలుపెరగకుండా ప్రచారం చేస్తున్నది. ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో పాటు ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి సభలు, సమావేశాలు, రోడ్ షోలు నిర్వహిస్తుండగా, ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. శ్రేణులు ఇంటింటికీ వెళ్లి కేసీఆర్ సర్కారు చేపట్టిన ప్రగతిని వివరిస్తూనే కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతున్నారు. ఏ గ్రామానికి వెళ్లినా బీఆర్ఎస్ పార్టీకి అపూర్వ స్పందన వస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకే విజయం అందిస్తామని ప్రజలు స్వచ్ఛందంగా చెబుతుండగా, శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తున్నది.

### గెలుపే లక్ష్యంగా..

జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లోని 15 మండలాల్ల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను ప్రారంభించి ప్రచారంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దూసుకుపోతున్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా ఊరూరా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు స్పష్టమైన హామీలు ఇవ్వడంతో పాటు బీఆర్ఎస్ విజయం సాధించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నారు.

### ముఖ్య నేతల ప్రచారం

కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్రీడా మైదానంలో బుధవారం మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రముఖులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కౌటాల మండల కేంద్రంలోని జగదాంబ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు పాల్గొని మాట్లాడారు. పెంచికల్‌పేట్‌లో ఎమ్మెల్సీ దండె విఠల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రెబ్బెన మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే కోవ లక్ష్మి విస్తృతంగా ప్రచారం చేశారు.



కౌటాల: బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆత్రం సక్కు